

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కొరకు సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక


సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777

విజయవాడ శనివారం 29-08-2026 సంపుటి: 02 సంచిక : 57 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ల హిమ పావని

Vijayawada Saturday 29-08-2026 Volume :02 Issue: 57 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani





# భయం భయంగా నేపాల్

- నేపాల్ వరద మృతుల సంఖ్య 584
- 3700 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- ఏ క్షణమైనా సరస్సులు తెగిపోయే ప్రమాదం
- పొంగిపొర్లుతున్న రెండు హిమానీ నది సరస్సులు
- హెచ్చరించిన చైనా పోలీసులు
- సైన్యం రక్షించిన వారిలో 85 మంది భారతీయులు
- చైనాలో 400 మంది భారతీయులు సురక్షితం: కేంద్రం వెల్లడి

02

## పొంచివున్న మరో ప్రళయం

నేపాల్‌ను ఇప్పటికే అతలాకుతలం చేసిన వరదల విషాదం ఇంకా ముగియకముందే మరో భారీ ప్రమాదం ముంచుకొస్తోంది. నేపాల్--టిబెట్ సరిహద్దు సమీపంలోని రెండు హిమానీనద సరస్సులు ప్రమాదకర స్థాయిలో పొంగిపొర్లుతుండటంతో దిగువ ప్రాంతాల్లో మరోసారి జలప్రళయం సంభవించే భయం నెలకొంది. వరదల్లో ఇప్పటివరకు 584 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 3,700 మందికిపైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించినప్పటికీ వందలాది మంది ఇంకా గల్లంతుగానే ఉన్నారు. భారతీయులు సహా యాత్రికులు, పర్యాటకుల ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతుండగా, ప్రతికూల వాతావరణం సహాయక చర్యలను మరింత క్లిష్టంగా మారుస్తోంది. మరోవైపు వరద ప్రవాహాల్లో కొట్టుకొచ్చిన బంగారం, నగదు కోసం కొందరు దుర్మార్గులు మృతదేహాలనూ వదలకపోవడం ఈ విపత్తు మధ్య మానవత్వాన్ని ప్రశ్నించే ఘటనగా మారింది.



# ఎరువుల కొరత లేదు

- రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు..
- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- శ్రీకాకుళంలో 16 మంది డీలర్ల లైసెన్సులు సస్పెండ్..
- మరో 62 మందికి షోకాజ్ నోటీసులు
- ఎరువుల లభ్యతపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం/ కోటబొమ్మాళి ఆగస్టు 28 :

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎరువుల లభ్యతపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 1,65,583 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను ఇప్పటివరకు 1,51,857 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయని మంత్రి తెలిపారు. ఖరీఫ్ పంటలకు జిల్లాకు మొత్తం 37,707 టన్నుల యూరియా, 22,322 టన్నుల డీఏపీ అవసరమని, ఇప్పటివరకు 27,147 టన్నుల యూరియా, 10,815 టన్నుల డీఏపీ జిల్లాకు చేరిందని వివరించారు. ఇందులో 12,158 టన్నుల యూరియా, 5,277 టన్నుల డీఏపీని రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా ఏపీ ఏఎంఎస్ యాప్‌లో నమోదు చేసుకుని పారదర్శకంగా రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 11,132 టన్నుల

-మిగతా 2 లో

## జగన్..దమ్ముంటే

# చర్చకు రా!

పులివెందుల అయినా, తాడేపల్లి ఇంటికైనా వస్తా.. చర్చకు సిద్ధమా..?



- టైమ్.. డేట్ నువ్వే ఫిక్స్ చెయ్.. జగన్ కు లోకేష్ సవాల్
- ఏపీపీఎస్సీకి.. డీఎస్సీకి తేడా తెలియని జగన్ నాకు నీతులు చెబుతారా?
- స్థానిక ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో గెలుస్తాం
- వెలిగొండ శంకుస్థాపన చేసింది బాబే.. ప్రారంభించేది కూడా చంద్రబాబే
- రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే కూటమి మరో మూడుసార్లు గెలవాలి
- కార్యకర్తలు నాయకుల చుట్టూ కాదు.. ప్రజల చుట్టూ తిరగాలి: నారా లోకేష్

అమరావతి

జగన్‌కు పదోసారి సవాల్ చేస్తున్నా.. టైమ్, డేట్ ఫిక్స్ చెయ్.. పులివెందులకు అయినా, తాడేపల్లి కొంపకు అయినా వస్తా.. చర్చకు సిద్ధమా?" అంటూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ తనకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో శుక్రవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. డీఎస్సీ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందని లోకేష్ అన్నారు. డీఎస్సీపై 150 కేసులు వేసినా వాటన్నింటినీ అధిగమించి విజయవంతంగా పరీక్ష నిర్వహించి టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించిందన్నారు.

-మిగతా 2 లో



# చైనాలో భూకంపం

- రిక్టర్ స్కేలుపై 5.1 ని తీవ్రతతో నమోదు
- భూమికి 13 కి.మీ. లోతులో ప్రకంపనలు
- నేపాల్‌లో మరో హెచ్చరిక జారీ
- వరద ప్రవాహం పెరిగే అవకాశం
- రెస్క్యూ టీమ్‌ను వెనక్కిరప్పిస్తున్న అధికారులు

పెషావర్ :

చైనాలోని సిచువాన్‌లో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో పొరుగున ఉన్న నేపాల్‌కు శుక్రవారం మరో వరద హెచ్చరిక జారీ అయింది. భూకంప ధాటికి చైనా, నేపాల్? సరిహద్దు? ప్రాంతంలో ఉన్న ఆనకట్ట తెగిపోయిందని పోలీసులు భావిస్తున్నారు. అలాగే, ఎగువ నుంచి వస్తున్న

-మిగతా 2 లో



## నెతన్యాహుకు ఇరాన్

# ఘాటు హెచ్చరిక


- 'నెతన్యాహును నరకానికి పంపిస్తాం'' అంటూ సంచలన వ్యాఖ్యలు
- ట్రంప్ కుమారుడిపై హత్యాయత్నం ఆరోపణలను ఖండించిన ఇరాన్
- అమెరికా, ఇజ్రాయెల్‌పై తీవ్ర విమర్శలు
- యుద్ధం ఇక కొత్త విధానంలో ఉంటుందని హెచ్చరిక

02

# హిమాలయాల్లో ప్రమాద ఘంటికలు..!

- వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు
- హిమపాతానికి బదులు ఎత్తైన ప్రాంతాల్లో వర్షాలు
- ఐదు నెలల క్రితమే హెచ్చరించిన శాస్త్రీయ నివేదికలు
- 1975 నుంచి 27 మీటర్లు తగ్గిన మంచు మందం
- 200 కోట్ల మంది నీటి భద్రతపై ఆందోళన

నేపాల్‌ను వణికించిన ఆకస్మిక వరదల వెనుక వాతావరణ మార్పుల తీవ్ర ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. హిందూ కుష్--హిమాలయ ప్రాంతంలోని హిమానీనదాలు ఈ సహస్రాబ్ది ప్రారంభం నుంచి మరింత వేగంగా కరిగిపోతుండగా, ఒకప్పుడు మంచు కురిసే 7 వేల మీటర్లకు పైబడిన ఎత్తైన ప్రాంతాల్లో ఇప్పుడు వర్షాలు కురుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. హిమానీనదాల మంచు నష్టం రెట్టింపై, 1975 నుంచి వాటి మందం 27 మీటర్ల వరకు తగ్గిపోయిందని ఐసీఐఎంవోడీ నివేదికలు వెల్లడించాయి. ఆసియాకు 'జలస్తంభాలు'గా పేరొందిన ఈ పర్వత ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు భవిష్యత్తులో దాదాపు 200 కోట్ల మంది ప్రజల నీటి భద్రత, జీవనాధారాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



02

## పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా

# ఇందిరమ్మ టవర్స్



క్యూఆర్ పరిధిలో అత్యంత పారదర్శకంగా ఇందిరమ్మ టవర్స్ లక్కీడ్రా

- 16 నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా
- రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున ప్రక్రియ
- పేదలకు రూపాయి ఖర్చు లేకుండా ఉచిత రిజిస్ట్రేషన్
- హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


హైదరాబాద్,

హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు రాష్ట్ర హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హతే ప్రామాణికంగా, కులమతాలు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని స్పష్టం చేశారు. క్యూఆర్ ప్రాంతంలో తొలి విడతగా చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపునకు

-మిగతా 2 లో

## విజన్ ప్లాన్‌పై ప్రజా ప్రతినిధులు నిరంతరం

# సమీక్షించాలి




- నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు పనితీరుకు ప్రామాణికం
- ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు
- అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ ఉండాల్సిందే.
- నియోజకవర్గ విజన్ ప్లాన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు
- నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి సమీక్ష
- ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్

అమరావతి

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం, సుపరిపాలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేలు, యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో సీఎం మాట్లాడారు. నియోజక వర్గాల వారిగా విజన్ ప్లాన్ రూపొందించుకుని పని చేయడం దేశంలోనే ప్రథమంగా ఏపీలోనే

-మిగతా 2 లో

# చైనాలో భూకంపం

మొదటి తరువాయి


భారీ నీటి ప్రవాహం నది నీటిమట్టం పెరిగే ప్రమాదం ఉన్నందున, నేపాల్‌లోని ప్రభావిత ప్రాంతమైన త్రిశూలి ప్రాంతాన్ని మరోసారి ఖాళీ చేయిస్తున్నట్లు నేపాల్ పోలీసులు తెలిపారు. బీజింగ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం సంభవించిన ఈ భూకంపం భూమికి 13 కి.మీ. లోతులో సంభవించినట్లు తెలుస్తోంది. పైనుంచి బురదతో కూడిన నీటి ప్రవాహం వేగంగా వస్తుండటంతో, నేపాల్‌లోని త్రిశూలి పరివాహక ప్రాంతాన్ని అధికారులు తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొంటున్న సైన్యం, భద్రతా సిబ్బంది, స్థానిక ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని నేపాల్ పోలీసులు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

కాగా, చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లోని లాంగ్‌చాంగ్ నగరాన్ని భూకంపం కుదిపేసిందని చైనా భూకంప నెట్‌వర్క్ సెంటర్ తెలిపినట్లు ఇంచీ నివేదించింది.

మరోవైపు, నేపాల్‌లో వరద వల్ల నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. కాబట్టి సహాయక చర్యల్లో పాల్గొన్న వాహనాలను వెనక్కి తిరగివస్తున్నాయని చెప్పారు. నేపాల్‌కు మరో తీవ్రమైన వరద ముప్పు పొంచి ఉందని అన్నారు. పైనుంచి వస్తున్న భారీ నీటి ప్రవాహం వల్ల నేపాల్‌లోని త్రిశూలి ప్రాంతంలో ప్రజలను మరోసారి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. అలాగే, నేపాల్–చైనా సరిహద్దు సమీపంలో భోటే కోషి నది దిగువన ఉన్న ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని నేపాల్ జలవిజ్ఞాన, వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ సరస్సులో సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రానున్న మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు అందులోకి చేరే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఆనకట్ట తెగిపోయే ప్రమాదం ఉందని చైనా అధికారులు నేపాల్‌కు తెలియజేశారు. ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ చర్యల్లో పాల్గొన్న భద్రతా దళాలు మరోవైపు, భౌగోళిక సవాళ్లు ఉన్నప్పటికీ నేపాల్? సైన్యం సహాయక చర్యలను కొనసాగిస్తోందని ప్రతిపక్ష నాయకుడు భీష్మ రాజ్ పేర్కొన్నారు. త్రిశూలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "సైన్యం, హెలికాప్టర్? బృందం సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. ఈ ఆపరేషన్‌లో రెండు సైనిక హెలికాప్టర్ల?తో పాటు, ఇతర ప్రైవేటు రంగానికి చెందిన మరికొన్నింటిని రంగంలోకి దించారు. అందుబాటులో ఉన్న ప్రతి వనరునూ వినియోగించుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఓ అధికారి మీడియాతో మాట్లాడారు. తాము కార్మండు నుంచి వచ్చామని, ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రభుత్వం, నేపాల్? ప్రభుత్వం రెండూ కలిసి శిథిలాలను తొలగించే పనిలో నిమగ్నమై ఉందని పేర్కొన్నారు.

## హిమాలయాల్లో ప్రమాద ఘంటికలు..!

**వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు**
**హిమపాతానికి బదులు ఎత్తైన ప్రాంతాల్లో వర్షాలు**
**ఐదు నెలల క్రితమే హెచ్చరించిన శాస్త్రీయ నివేదికలు**
**1975 నుంచి 27 మీటర్లు తగ్గిన మంచు మందం**
**200 కోట్ల మంది నీటి భద్రతపై ఆందోళన**




న్యూఢిల్లీ,

ఈ సహస్రాబ్ది ప్రారంభం నుంచి హిందూ కుష్ హిమాలయ(హెచ్‌కేహెచ్) అంతటా విస్తరించి ఉన్న హిమానీనదాలు మరింత వేగంగా కరిగిపోతున్నాయని, మంచు నష్టం పరిమాణం రెట్టింపు అయ్యిందని హెచ్‌కేహెచ్ ప్రజల తరఫున పనిచేస్తున్న ఒక అంతర్ ప్రభుత్వ విజ్ఞాన, అధ్యయన కేంద్రం ఐదు నెలల క్రితం వెలువరించిన రెండు నివేదికలు వెల్లడించాయి. 1975 నుంచి హిమానీ నదాల మంచు మందం 27 మీటర్ల వరకు తగ్గిపోయిందని ఈ నివేదికలు పేర్కొన్నాయి. కాఠ్మాండు కేంద్రంగా పనిచేసే ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్(ఐసీఐఎంవోడీ) ఈ నివేదికలను విడుదల చేసింది. ఆసియా జలస్తంభాలు అని పిలిచే ప్రాంతాల్లో నీటిపై ఆధారపడి జీవిస్తున్న దిగువ ఉన్న దాదాపు 200 కోట్ల మంది ప్రజలకు భవిష్యత్తులో ఒక ఆందోళనకరమైన పరిస్థితి ఎదురవుతుందని ఆ నివేదికలు హెచ్చరించాయి. రెండు రోజుల క్రితం వందల మంది ప్రాణాలను బలిగొన్న నేపాల్ ఆకస్మిక వరదలకు అసలు కారణం ఏమిటనే దానిపై శాస్త్రవేత్తలు, పరిశోధకులు దర్యాప్తు చేస్తుండగా వారిలో చాలామంది అనేక అంశాల కలయికే దీనికి కారణమని భావిస్తున్నారు. అయితే అందులో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే 7వేల మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తులో మంచు కురవడానికి బదులుగా వర్షం కురవడం. ఒకప్పుడు హిమపాతం నమోదైన ఎత్తైన ప్రాంతాలలో ఇప్పుడు వర్షాలు కురుస్తున్నాయని, అలాగే హిమానీనదాలు చాలా వేగంగా కరిగిపోతున్నాయని, దీనికి కారణం వాతావరణం వేడెక్కడమేనని శాస్త్రవేత్త ఒకరు తెలిపారు.

## నెతన్యాహుకు ఇరాన్ ఘాటు హెచ్చరిక

**-"నెతన్యాహును నరకానికి పంపిస్తాం" అంటూ సంచలన వ్యాఖ్యలు**
**-ట్రంప్ కుమారుడిపై హత్యాయత్నం ఆరోపణలను ఖండించిన ఇరాన్**
**-అమెరికా, ఇజ్రాయెల్‌పై తీవ్ర విమర్శలు**
**-యుద్ధం ఇక కొత్త విధానంలో ఉంటుందని హెచ్చరిక**



న్యూఢిల్లీ,

ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఇరాన్ ఘాటు హెచ్చరిక జారీ చేసింది. తాము నెతన్యాహును నరకానికి పంపుతాం అని హెచ్చరించింది. ఇదే సమయంలో ఇకపై తమ యుద్ధం కొత్త విధానంలో ఉంటుందని ఇరాన్ తెలిపింది. తమ నౌకా మార్గాన్ని బ్లాక్ చేసిన అమెరికాకు కూడా ఇరాన్ వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రెటరీ మేజర్ జనరల్ మోషెన్ రెజాయే తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్, అమెరికాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమారుడు బ్యారోన్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ప్రయత్నించారు అంటూ నేరుగా ట్రంప్ చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. తాము అలాంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. ఇదంతా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇచ్చిన తప్పుడు సమాచారం అన్నారు. అయితే, తాము నెతన్యాహును నరకానికి పంపుతాం అని హెచ్చరించారు. నెతన్యాహు తీసుకుంటున్న తప్పుడు నిర్ణయాలు జియోనిస్ట్ పాలనకు ముగింపు పలకబోతుందనే విషయాన్ని తాము నిరూపిస్తామని వివరించారు. ట్రంప్ కుమారుడిని చంపాలనుకుంటున్నట్లు నెతన్యాహు తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా ట్రంప్‌ను ఆందోళనకు గురయ్యేలా చేశారని, దీంతో ట్రంప్ ఒక ఫుడ్ ట్రక్ వర్కర్‌లాగా మారాల్సి వచ్చిందిన మోషెన్ వ్యాఖ్యానించారు.

## విజన్ ప్లాన్‌పై ప్రజా ప్రతినిధులు నిరంతరం సమీక్షించాలి

మొదటి తరువాయి

అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి జాతీయ స్థాయిలో మంచి పేరు వచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో నియోజకవర్గాల విజన్ ను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలది కీలక పాత్ర అని చెప్పారు. రూపొందించుకున్న కీ–పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ఆయా రంగాల్లో వృద్ధి నమోదు చేసేలా పని చేయాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్లలో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది కీలక పాత్ర పోషించాలని... ఆ మేరకు వినూత్నంగా ఆలోచించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం... ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలపై ఫోకస్ పెట్టాలని సూచించారు. స్థానికంగా ఉండే వనరుల లభ్యతను ఆధారంగా చేసుకుని ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నియోజక వర్గాల విజన్ ను అందించామని, ఆయా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు డేటా లేక్ సిద్ధం చేశామని... అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించుకోవడంతోపాటు.. పూర్తి స్థాయిలో టెక్నాలజీని వినియోగించుకోవాలని సీఎం ఆదేశించారు. నియోజకవర్గాల యాక్షన్ ప్లాన్ అమలుపై ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు సమీక్షలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్ర స్థాయిలో సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులకు కేవలం నగదు సాయం అందించడమే కాకుండా, వారిని ఆర్థికంగా నిలబెట్టి సాధికారత వైపు నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి–సంక్షేమం చేపడుతోందని..వాటిని ప్రజలకు వివరించే బాధ్యతను ప్రజా ప్రతినిధులే తీసుకోవాలని అన్నారు. పి4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. పేదరిక నిర్మూలనకు పారిశ్రామికవేత్తలను సైతం ప్రోత్సహిస్తూ, సమాజంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగించాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రతి నియోజక వర్గంలోనూ తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అలాగే అనుమతులు పొందుతున్న పరిశ్రమలు ఆయా జిల్లాల్లో, నియోజకవర్గాల్లో గ్రౌండ్ అయ్యే విధంగా ప్రజా ప్రతినిధులు, క్షేత్ర స్థాయి అధికారులు.. సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని సీఎం ఆదేశించారు.

# భయం భయంగా నేపాల్...

**-పొంచివున్న మరో ప్రళయం**
**--నేపాల్ వరద మృతుల సంఖ్య 584**
**-3700 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు**
**-ఏ క్షణమైనా సరస్సులు తెగిపోయే ప్రమాదం**
**-పొంగిపొర్లుతున్న రెండు హిమానీ నదీ సరస్సులు**
**-హెచ్చరించిన చైనా పోలీసులు**
**-సైన్యం రక్షించిన వారిలో 85 మంది భారతీయులు**
**-చైనాలో 400 మంది భారతీయులు సురక్షితం: కేంద్రం వెల్లడి**




ఖాట్మండ్:

నేపాల్ ఇంకా భయం గుప్పిట్లోనే ఉంది. ఇప్పటికే వరద విధ్వంసంతో చిగురుటాకులా వణికిన నేపాల్ మరో ముప్పును ఎదుర్కోబోతోంది. నేపాల్–టిబెట్ సరిహద్దుల సమీపంలోని గాలింగ్ సరిహద్దు ప్రాంతం ఎగువన హిమానీనదం కరిగిపోవడంతో ఏర్పడిన సమాజ సరస్సులు రెండు ఇప్పుడు పొంగిపొర్లుతున్నాయి. నదిస్సు నుండి నీరు గట్టును దాటి బయటకు వస్తున్నట్లు చైనీస్ మీడియా శుక్రవారం వెల్లడించింది. సరస్సు నుంచి భారీగా నీరు బయటకు వస్తుండటంతో దిగువ ప్రాంతాల్లోని నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. నదీ పరివాహక ప్రాంతాలకు భారీ వరద ముప్పు ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవి తెగిపోతే మరోసారి భారీ వరదలు సంభవించే ప్రమాదం ఉందని నిపుణులు తెలిపారు. ఈ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని శుక్రవారం చైనా ప్రభుత్వం కొంతసేపు సహాయక చర్యలను నిలిపివేసింది. అనంతరం డ్రోన్లు, శాటిలైట్లు, శాటిలైట్ ఛాయాచిత్రాల ద్వారా పరిస్థితిని పరిశీలించిన తర్వాత ప్రమాద స్థాయి కొంత తగ్గిందని అంచనా వేసి మళ్లీ సహాయక చర్యలను ప్రారంభించింది. అయినప్పటికీ ప్రాంతంలో భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం కొనసాగుతుండటంతో సహాయక బృందాలు అత్యంత అప్రమత్తంగా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు నేపాల్‌లో 584 మంది మృతి చెందినట్లు అధికారులు ధృవీకరించారు. చైనా వైపున మరో ఐదుగురు మృతి చెందడంతో మొత్తం మృతుల సంఖ్య 552కు చేరింది. ఈ వరదల్లో నేపాల్ పర్యాటక బోర్డు సహాయంతో 117 మంది పర్యాటకులను సురక్షితంగా రక్షించగా, వీరిలో 85 మంది భారతీయులు ఉండగా.. చైనా, దక్షిణ కొరియా, అమెరికా, ఇటలీ తదితర దేశాలకు చెందిన పర్యాటకులు కూడా ఉన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, చైనా వైపున చిక్కుకుపోయిన 98 మంది భారతీయులు కూడా సురక్షితంగా నేపాల్‌కు చేరుకున్నారు. వందలాది మంది భారతీయులు సహా మొత్తం 1,400 మందికి పైగా ఇప్పటికీ గల్లంతైనట్లు సమాచారం. భారత ప్రభుత్వ అంచనా ప్రకారం కనీసం 320 మంది భారతీయుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. గల్లంతైన వారిలో పర్యాటకులు, కైలాస్ మానస సరోవర్ యాత్రికులు, స్థానికులు, సహాయ సిబ్బంది ఉన్నారు. రెడ్ క్రాస్ అంచనా ప్రకారం ఈ విపత్తు వల్ల 90 వేల మందికిపైగా ప్రజలు ప్రభావితమ య్యారు. ఇప్పటివరకు 3,700 మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రతికూల వాతావరణం కారణంగా సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. ఇంకా 320 మంది భారతీయుల ఆచూకీ గల్లంతు ఖాట్మండ్‌లోని వరద ప్రభావిత ప్రాంతం నుండి 21 మంది భారతీయులు నిన్న సురక్షితంగా చేరుకున్నారని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

త్రిశూలి జల విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న మరో 63 మంది భారతీయులను గురువారం రక్షించారు. చైనా వైపు చిక్కుకుపోయిన మరో 98 మంది భారతీయులు సురక్షితంగా భూమార్గం ద్వారా నేపాల్‌లోకి ప్రవేశించాలని తెలిపినట్లు రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఇంకా దాదాపు 320 మంది భారతీయులు, 100 మంది భారతీయ మూలాలున్న వ్యక్తుల ఆచూకీ కనుగొనలేకపోతున్నట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల నుండి తరలించిన భారతీయ పర్యాటకులను నేపాల్‌లో భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ శుక్రవారం కలుసుకున్నారు.

కొట్టుకొచ్చిన బంగారం, వెండి కప్‌బోర్డ్

అనేక ప్రాంతాల్లో జనాలు సర్వస్వం కోల్పోయి వీధిన పడ్డారు. ఇలాంటి విపత్తు సమయంలో విపరీతమైన ఆస్తి నష్టం, ప్రాణనష్టం వాటిల్లింది. పలు ప్రాంతాల్లో డబ్బుతో పాటు బంగారం నీటి ప్రవాహంలో కొట్టుకువచ్చాయి. వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన ఓ మహిళ మృతదేహం నుంచి కొందరు ఆభరణాలను దొంగిలించిన దారుణ ఘటన వెలుగు చూసింది. నారాయణి నది ఒడ్డుకు కొట్టుకొచ్చిన ఓ మృతదేహం నుండి కొందరు దొంగలు బంగారు నగలను దొంగిలించారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీనిపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు బాధ్యులైన ఇద్దరు వ్యక్తులను నేపాల్ పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. మరోవైపు త్రిశూలి నది వరద ఉధృతికి బంగారు, వెండి ఆభరణాలు ఉన్న కప్‌బోర్డు ఒకటి కొట్టుకొచ్చింది. స్థానికులు దానిని తెరిచి చూడగా.. అందులో పెద్ద మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు కనిపించింది. 'జై శ్రీ మహాలక్ష్మి గోల్డ్ అండ్ సిల్వర్ షాప్' అని రాసి ఉన్న బిల్లు కూడా ఇదే అల్మారాలో లభించింది.

# ఎరువుల కొరత లేదు

మొదటి తరువాయి

యూరియా, 3,766 టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు :

రైతులకు ఎరువుల లభ్యతలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడతామని అచ్చెన్నాయుడు తెలిపారు. ఎరువులను నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయించే ప్రైవేట్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుంచి అందిన సమాచారం ఆధారంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించామని, నిబంధనలు ఉల్లంఘించి ఎరువులను అధిక ధరలకు విక్రయించిన 16 మంది ప్రైవేట్ డీలర్ల లైసెన్సులను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. మరో 62



మంది డీలర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఎవరైనా ఎరువుల విషయంలో అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే తప్పవని హెచ్చరించారు.

# జగన్..దమ్ముంటే చర్చకు రా!

మొదటి తరువాయి

ఈ ఏడాది కాకుండా రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తామని స్పష్టం చేశారు. 'జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు' అని వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టుపైనా జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని లోకేష్ విమర్శించారు. ప్రాజెక్టు పనులు పూర్తికాకముందే గత ప్రభుత్వం జాతికి అంకితం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు ఆర్అండ్ఆర్ ప్రాజెక్ట్‌తో పాటు మిగిలిన పనులన్నీ పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తే క్రెడిట్ వోరి అంటున్నారని విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో దాన్ని ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించేలా ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని లోకేష్ పిలుపునిచ్చారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన విజయానికి అదనంగా మరో రెండు శాతం ఓట్లను సాధించేలా కృషి చేయాలని సూచించారు. 'కార్యకర్తలు మా చుట్టూ తిరగొద్దు.. ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది' అని స్పష్టం చేశారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుని తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

మై టీడీపీ యాప్ ద్వారా సుమారు నాలుగు లక్షల మంది నాయకుల పనితీరును పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పార్టీ అప్పగించే కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలులో పోతురాజు కాలువ, నల్లకాలువ అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. వాటిని పూర్తి చేసిన తర్వాత ప్రాధాన్యత క్రమంలో మిగిలిన అభివృద్ధి పనులను చేపడతామన్నారు.

మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిలోకి

టీడీపీది పెద్ద కుటుంబమని, గత ఎన్నికల్లో జనసేన, బీజేపీతో కలిసి ప్రజల వద్దకు వెళ్లి 94 శాతం సీట్లలో విజయం సాధించామని లోకేష్ గుర్తుచేశారు. కూటమి ఐక్యతను కొనసాగించాలని కార్యకర్తలకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు పాలనపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే టీడీపీ కూటమి మరో మూడుసార్లు వరుసగా విజయం సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటే తీవ్రంగా నష్టపోయేది రాష్ట్ర ప్రజలేనని హెచ్చరించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తనపై 23 కేసులు పెట్టారని తెలిపారు. మంగళగిరిలో 40 ఏళ్లుగా టీడీపీ గెలవని పరిస్థితిలో తాను 91 వేల మెజారిటీతో గెలిచానని, అది తన సత్తాకు నిదర్శనమని అన్నారు.

వైసీపీ నేతలపై తీవ్ర ఆరోపణలు

జగన్ చేసిన తప్పులకు కొందరు వైసీపీ నాయకులు ఇప్పుడు జైలుకు వెళ్తున్నారని లోకేష్ ఆరోపించారు. తాము చేసిన తప్పులకు ప్రభుత్వం కారణమని చెప్పడం సరికాదన్నారు. వైసీపీ హయాంలో బీసీలకు 10 శాతం రిజర్వేషన్ తగ్గించారని, సుమారు 17 వేల మంది బీసీలకు పదవులు దక్కకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. అమర్నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. ప్రస్తుత ఎంపీ విజయసాయిరెడ్డిపై కూడా తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసేందుకు ప్రయత్నించారని అన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత టీడీపీ కార్యకర్తలపై ఉందని సూచించారు.

# పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇందిరమ్మ టవర్స్

మొదటి తరువాయి

అత్యంత పారదర్శకంగా లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. మీడియా, అర్హులైన లబ్ధిదారుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహిస్తూ, మొత్తం ప్రక్రియను అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని చెప్పారు. శుక్రవారం నాంపల్లి, కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం లక్కీడ్రా నిర్వహించారు. నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్‌లో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కేటాయింపునకు వెట్ గార్డెన్స్‌లో, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్‌దేవ్‌పల్లి పరిధికి సంబంధించి లక్కీగూడలో నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని డ్రా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిన్నటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 8 వేల ఫ్లాట్లకు లక్కీడ్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లక్కీడ్రా ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో 480 ఫ్లాట్లకు 600 మంది లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేస్తామని మంత్రి వివరించారు. అనంతరం అధికారులు క్షేత్రస్థాయిలో తుది పరిశీలన నిర్వహిస్తారని, ఎంపికైన వారిలో ఎవరైనా అనర్హులుగా తేలితే మిగిలిన 120 మందిలోని అర్హులకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. అనంతరం రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం రాష్ట్ర ప్రభుత్వానికి గొప్ప విజయమని అన్నారు. క్యూఆర్ పరిధిలో తొలి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఆయా నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం సెప్టెంబర్ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోనే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి తెలిపారు.


# పవిత్ర బంధానికి "రక్షాబంధన్" ప్రతీక- మంత్రి ఎన్ఎండి ఫరూక్





**అమరావతి, ఆగస్టు 28,( నేటి దర్శిని )** రాఖీ అనేది కేవలం ఒక పండుగ కాదని, అన్నా-చెల్లెళ్లు, అక్కా-తమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ,నమ్మకం,రక్షణ అనే పవిత్ర బంధానికి ప్రతీక అని మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శుక్రవారం ఉర్దూ అకాడమీ చైర్మన్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి ఫరూక్ హాజరయ్యారు. రాఖీ పండుగను పురస్కరించుకొని పలువురు అక్క చెల్లెల్లు మంత్రి ఫరూక్ చేతికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడారు. కులం, మతం, ప్రాంతం అనే తేడా లేకుండా ఈ పండుగ మనందరినీ ఒకే తాటిపైకి తెస్తుందన్నారు. మైనారిటీ సోదరీమణులు, హిందూ సోదరీమణులు వచ్చి రాఖీ కట్టడం - ఇదే మన భారతీయ సంస్కృతిలోని గంగా-జమునా తెహజీబ్ కు నిదర్శనమని పేర్కొన్నారు.రాష్ట్రంలో మహిళల రక్షణ, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్ తొలగించాలని రేషన్ డీలర్ల వినతి



**గుంతకల్లు, ఆగస్టు 28,( నేటి దర్శిని )** సెప్టెంబర్ నెల నుంచి లబ్ధిదారులకు నిత్యవసరాలు పంపిణీ చేసే విషయంలో ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయాలన్న నిబంధనను తొలగించాలని కోరుతూ శుక్రవారం గుంతకల్లు తహ శీల్దార్ కు స్థానిక రేషన్ డీలర్లు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ నెల నుండి రేషన్ కార్డుదారులకు పంపిణీ చేసే 10 శాతం టోకెన్ రైస్ బియ్యం బస్తాలపై కొత్తగా క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేయాలని ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఆదేశించిందన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ, రూరల్ ప్రాంతాలకు చెందిన రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి పది వేలు జరిమానా



**తనకల్లు ఆగస్టు 28,( నేటి దర్శిని )** శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం పరాకు వాండ్లపల్లి గ్రామానికి చెందిన పల్లపు రెడ్డి శేఖర్ మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతూ పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. అంతేకాకుండా, ఇతను తరచూ మద్యం మత్తులో తన భార్యాపిల్లలు, తల్లిదండ్రులు, అత్తమామలతో గొడవపడుతూ చుట్టుపక్కల ప్రజల మనశ్శాంతికి కూడా భంగం కలిగిస్తున్నట్లు పోలీసులు గుర్తించి అతనిపై కేసు నమోదు చేశారు. పోలీసులు నిందితుడిని కదిరిలోని జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, విచారణ చేపట్టిన న్యాయమూర్తి అతనికి రూ. 10,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ,కదిరి డీఎస్పీ లు మాట్లాడుతూ .. మద్యం సేవించి ప్రాణాలకు ప్రమాదం కలిగించేలా వాహనాలు నడిపినా, కుటుంబ సభ్యులపై దౌర్జన్యానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాల తీవ్రతను బట్టి జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని స్పష్టం చేస్తూ, సమాజ శాంతి కోసం ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తనకల్లు పోలీసులు తెలిపారు

# డ్రోన్ క్యారియర్ వాహక్-6 ఆవిష్కరణ




**న్యూఢిల్లీ : ఆగస్టు 28,( నేటి దర్శిని )** భారత రక్షణ రంగం ఆధునిక యుద్ధ కార్యకలాపాల కోసం మొదటి 'ఫ్లయింగ్ డ్రోన్స్ క్యారియర్'ను ఎండ్యూర్ ఎయిర్, 'బిఈఎల్'లతో కలసి 'వాహక్-6'ను అభివృద్ధి చేసింది. ఇది భారత సైన్యం పోరాట సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుంది. 'సబల్-20', మదర్‌షిప్, 'అలఖ్' మైక్రో-డ్రోన్‌లతో కూడిన ఈ రెండంచెల వ్యవస్థ జీపీఎస్ నిలిపివేసిన వాతావరణంలో కూడా అధునాతన నిఘా, ఎదురుదాడి మిషన్లను నిర్వహించడానికి వీలు కల్పిస్తుంది.

# ఉద్యోగం తొలగించిన కదలని పెవీకాల్ వీరుడు

-దేవస్థానం నిభందనలు ఉల్లంఘించి ఆడియో రికార్డింగ్ చేసిన అధికారి

-భద్రాతాదికారి సర్వీసు రిము చేసిన వసతి గదిని ఖాళీ చేయని వైనం

-శ్రీశైలంలో మాజి భద్రతాధికారికి ఎవరి అండండలు ఉన్నాయనే ఆరోపణలు





**శ్రీశైలం,ఆగస్టు28 (నేటి దర్శిని)** శ్రీశైలం దేవస్థానం మాజి భద్రతాధికారి దేవస్థానం వసతి గృహంలో ఫెవికాల్ వీరుడు తరహాలో అతుక్కుని ఉన్నారనే కలకలం శ్రీశైలంలో హాట్ టాపిక్ మారింది దేవస్థానంలో సివిఎస్ఓ గా భాధ్యతలు చేస్తూ భద్రతను కాపాడాలసిన అధికారే దేవస్థానం గోప్యతను ప్రతిష్టతను తుంగలో తొక్కి దేవస్థానం నిభందనలు పాటించకుండా డిసిప్లైన్ కోటలు తాటారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి శ్రీశైలం దేవస్థానంలో రెండెండ్ల కాలం భద్రాతా అధికారిగా విధులు నిర్వహించేందుకు వచ్చిన చీఫ్ సెక్యూరిటీ ఆఫీషర్ పోలీసు అధికారులతో వివాదాలు పెట్టుకున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవలి కాలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఆడియో కాల్ రికార్డింగ్ వివాదాలకు తావుచ్చిన సంగతి పాటకులకు విధితమే అయితే శ్రీశైలం దేవస్థానం నిభందనలు పాటాంచాలసిన భద్రాతాదికారి నిభందనలకు తూట్లు పొడుస్తూ పోలీసు అధికారులతో పోన్ కాల్ సంభాషణ రహస్యంగా రికార్డింగ్ చేసి దేవస్థానం ప్రతిస్టకు బంగం కలిగే విధంగా సోషల్ మీడియాలో ఆ ఆడియోను వైరల్ చేయడంపై దేవస్థానం అధికారులు ఈఓ శ్రీనివాసరావు దేవాదాయశాఖ ఉత్తర్వులు మేరకు భద్రతాధికారిని విధుల నుంచి తొలగించినప్పటికి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మాత్రం ఉద్యోగంలో లేకపోయినా దేవస్థానం వసతి గదిని వదిలిపెట్టకుండా దేవస్థానం వసతి గదిని ఖాలి చేయకుండా ఫెవికల్ వీరుడు మాదిరిగా అతుక్కుని కూర్చున్నాడనే విమర్శలు వెల్లువెత్తాయి. శ్రీశైలం దేవస్థానంలో శని ఆది సోమవారాలలో భక్తులు అధికసంఖ్యలో శ్రీశైలం మల్లన్నను దర్శించుకునేందుకు వస్తుంటారు అయితే ఈ నేపథ్యంలో భక్తులకు వసతి గదులు దొరక తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో మాజి చీఫ్ సెక్యూరిటీ ఆఫీషర్ దేవస్థానం వసతి గదిని ఖాలి చేయకుండా శ్రీశైలం దేవస్థానం ఆదాయానికి గండికొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి దేవస్థానం నియమ నిబంధనలు ప్రకారం ఉద్యోగములో లేకుండా సర్వీసు రిము చేసిన తరువాత మాజి ఉద్యోగిగా పరిగనిస్తారు. భద్రతాధికారి కూడ నిభందనలు తప్పనిసరిగా పాటించాలి అటువంటి అధికారి దేవస్థానంలోని గంగాసదన్ లో దేవస్థానం వసతి గదిని ఎలా వాడుకుంటారు అనే ప్రశ్నలు భక్తులలో పలు అనుమానాలు రెకెత్తిస్తున్నాయి గంగా సదన్ వసతి గదిని రోజుకు భక్తులకు రెంటికి ఇస్తే సుమారు ఎడువందల నుంచి ఎనిమిది వందల వరకు దేవస్థానానికి ఆదాయం వస్తుంది అలాంటిది భద్రాతాదికారి గత వారం రోజులుగా రుము కాలి చేయకుండా దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. శ్రీశైలం దేవస్థానం భద్రాతాదికారిగా విధుల నుంచి సివిఎస్ఓ ను తొలగిస్తూ ఉత్తర్వులు జారి అయిన మరు క్షనమే ఆ ధికారి నుంచి అఫీషల్ గా ఆ ధికారి వాడే వాహనం దేవస్థానం అధికారులు స్వాదీనం చేసుకున్నారు. కాని ఆ అధికారి నివసిస్తున్న వసతి గదిని దేవస్థానం అధికారులు ఖాలి చేయించి స్వాదీనం చేసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు భక్తులు విమర్శిస్తున్నారు ఏది ఏమైనప్పటికీ దేవస్థానం ఆదాయానికి గండిపడకుండా చూడాలసిన బాధ్యత అధికారులపై ఎంతైన ఉందని భక్తులు ఆరోపిస్తున్నారు.

# నీళ్లరేవు వయా అడవిపేట రహదారి పనులకు శంకుస్థాపన



**ముమ్మిడివరం, ఆగస్టు 28, ( నేటి దర్శిని )** శాసనసభ విప్ మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, రూ. 10.67 కోట్ల అంచనా వ్యయంతో సుమారు 19 కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణానికి కాట్రేనికోన మండలం నీళ్లరేవు వయా అడవిపేట రోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.చాలా ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక ఈ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ఆ ప్రాంత ప్రజలు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు ప్రత్యేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన ప్రభుత్వం రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించింది.ఈ సందర్భంగా దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గంలో అభివృద్ధి మరియు సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రహదారులు, తాగునీరు, మౌలిక వసతులు కల్పించడంతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటికి శాశ్వత పరిష్కారాలు సాధించడమే తమ లక్ష్యమని తెలిపారు.అభివృద్ధి కార్యక్రమాలే ప్రజల జీవితాల్లో నిజమైన మార్పుకు పునాది అని, నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందేలా నిరంతరం కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, రాష్ట్ర నాయకులు నాగిడి నాగేశ్వరరావు,ముమ్మిడివరం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ ఓగూరి భాగ్యశ్రీ,కాట్రేనికోన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు పెసింగి రంగారావు వర్మ,సీనియర్ నాయకులు దండుప్రోలు సత్యం,బొమ్మిడి లింగేశ్వరరావు,మోకా అప్పాజీ,నరసింహమూర్తి,మోకా బాల ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ మఠంలో ఘనంగా శాకోత్సవం







--ఉత్సవ మూర్తికి విశేష పూజలు.

--: కన్నుల పండువగా తెప్పోత్సవం.

----అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**మంత్రాలయం ఆగస్టు 28,( నేటి దర్శిని )** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో మఠం పీఠాధిపతిశ్రీ సుబుదేంద్ర తీర్థుల నేతృత్వంలో శాకోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. రాఘవేంద్ర స్వామి 355వ ఆరాధన సప్త రాత్రోత్సవాలలో భాగంగా రెండో రోజు నిర్వహించే అత్యంత విశేషమైన పవిత్రమైన కార్యక్రమం. ఊంజల సేవమండపం దగ్గర, కూరగాయలు ఆకుకూరలు, పండ్లు వుంచి అత్యంత శోభాయమానంగా అలంకరణ చేశారు . మఠం పీఠాధిపతి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రహ్లాదరాయులను ఊంజల మంటపంలో ఉంచి పూజలు చేశారు. ప్రకృతి ప్రసాదించిన కూరగాయలను స్వామివారికి నివేదించడం వల్ల, సకాలంలో వర్షాలు కురుస్తాయని, పంటలు బాగా పండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని పీఠాధిపతి ఈ కార్యక్రమం చేపడతారు. ఆరాధనో త్సవలలో భాగంగా ఉదయం నుంచి రాఘవేంద్ర స్వామి వారికి సుప్రభాత సేవ,నిర్మల విసర్జన సేవ, క్షీరాభిషేకం, ప్రహల్లాదరాయులకు పాదపూజ, పంచామృత అభిషేకం, సంస్థాన పూజలు మూలరాముల పూజలు, మంగళ హారతులు ఇస్తారు. పరిమళ పుష్కరిణిలో ప్రహ్లాదరాయులకు తెప్పోత్సవం నిర్వహించారు. పుష్కరిణిలో ఊరేగించారు. బెంగళూరుకు చెందిన ప్రభాత్ ఆర్ట్స్ నేషనల్ వారిచే నిర్వహించబడిన తపోహంస రాయరిద్దారే అనే నృత్య రూపక కార్యక్రమం భక్తులను కనువిందు చేసింది. ఈ కార్యక్రమంలో ఏఏవో మాధవ్ శెట్టి ,మేనేజర్లు వెంకటేష్ జోషి , ఎస్ కే శ్రీనివాసరావు , శ్రీపతిచార్ అసిస్టెంట్ మేనేజర్ ఐ.పి నరసింహ, వ్యాసరాజాచార్,, సురేష్కోనాపూర్,విజయేంద్ర ఆచార్, బద్రీనాథ్ పౌరాణిక అనంతచార్, తదితరులు,కర్ణాటక ఆంధ్ర తమిళనాడు తెలంగాణ రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆరాధనఉత్సవలలో పాల్గొన్నారు.

# అమలాపురంలో మొబైల్ ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర



**అమలాపురం,ఆగస్టు 28,( నేటి దర్శిని )** మొబైల్ ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్రలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శాంతి ఒకేషనల్ జూనియర్ కళాశాల మరియు మిరియం డిగ్రీ కళాశాల, అమలాపురం బస్టాండ్ ప్రాంతం, వై జంక్షన్ పేరూరు మరియు అమలాపురం గడియారస్తంభం కూడలి ప్రాంతాల్లో విద్యార్థులకు, ప్రజానీకానికి ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మరియు జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ సహాకారంతో జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సమగ్ర ఆరోగ్య ప్రచార రథం ద్వారా దృశ్య శ్రవణ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్ సురక్ష చైతన్య యాత్ర ద్వారా ప్రజలకు మరియు యువతకు ఆరోగ్య విషయాలు హెచ్ ఐ వి ఎయిడ్స్ మరియు మాదకద్రవ్యాలపై అవగాహన నివారణ చర్యలు గురించి తెలియజేయడం కోసం ఏర్పాటు చేశారని అమలాపురం ప్రాంతీయ ఆసుపత్రి ఐ సీటీసీ కౌన్సిలర్ కే. ప్రతాప్ కుమార్ తెలియజేశారు. జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ జి. శ్రీను మాట్లాడుతూ లైంగికశీగా సంక్రమించే వ్యాధులు మరియు కౌన్సిలింగ్ సేవలు మరియు స్థానిక హెచ్ ఐ వి పరీక్ష మరియు వివరాలు సేకరించి వారికీ దీనిపై అవగాహన కల్పించే కార్యక్రమం కాలేజీ విద్యార్థులకు ఎయిడ్స్ రాకుండా తీసుకోవలిసిన జాగ్రత్తలు వాటి యొక్క ప్రమాద పరిస్థితులు పై తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్ట్ సిబ్బంది కుంచె శ్రీనివాస్, పీఠం ఎడ్యుకేటర్ గుర్రాల అమల మరియు మిరియం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తమేశ్వరరావు, అధిక సంఖ్యలో ప్రజానీకం ,విద్యార్థులు వీక్షించడం జరిగింది.




# దూసుకుపోతున్న ఇరుముడి

## గ్రామీణ ప్రాంతాల్లో భారీగా టికెట్ల అమ్మకం




మాస్ మహారాజా రవితేజ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతూ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. విడుదలైనప్పటి నుంచి వరుసగా రికార్డులు సృష్టిస్తున్న ఈ చిత్రం తాజాగా ఆన్‌లైన్ టికెట్ విక్రయాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ప్రముఖ టికెటింగ్ ఎ÷-లాట్‌ఫార్మ్‌లైన బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్స్ ద్వారానే 'ఇరుముడి'కి 55 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఒక ప్రాంతీయ చిత్రానికి ఈ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రవితేజ మాస్ అప్పీల్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుండటంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ కొనసాగుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మాస్ ప్రేక్షకుల వరకు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో సినిమా కలెక్షన్ల పరంగా కూడా దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇరుముడి' ఇప్పుడు టికెట్ విక్రయాల్లోనూ తన సత్తా చాటుతూ కొత్త రికార్డులను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చిత్రానికి ఉన్న జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో మరిన్ని మైలురాళ్లు అందుకోవడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# నేడు కింగ్ 100 టైటిల్ గ్లింప్స్ విడుదలకు సిద్ధం



టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన కెరీర్‌లో వందో మైలురాయిగా నిలుస్తున్న ప్రతిష్టాత్మక 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. యువ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. నాగార్జున పుట్టినరోజు కానుకగా ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫాస్టెన్ యువర్ సీట్‌బెల్ట్స్ రేపటి నుంచి కింగ్ ఆధిపత్యం మొదలవ్వబోతోంది అంటూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకున్న ఈ అనౌన్స్‌మెంట్ ప్రస్తుతం అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.

# మళ్లీ లవ్ బ్రేకప్

## -బాయ్‌ఫ్రెండ్ వాకర్ బ్లాంకోకి గుడ్ బై చెప్పిన అనన్య పాండే



బాలీవుడ్ యంగ్ బ్యూటీ అనన్య పాండే వ్యక్తిగత జీవితం మరోసారి బీ-టౌన్‌లో చర్చనీయాంశంగా మారింది. గత కొంతకాలంగా ప్రేమలో ఉన్నట్లు వార్తల్లో నిలిచిన ఆమె, తన ప్రియుడు వాకర్ బ్లాంకోతో విడిపోయినట్లు జాతీయ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దాదాపు రెండేళ్లుగా వీరి రిలేషన్ కొనసాగగా, తాజాగా ముగింపు పలికారనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే అనన్య పాండే లేదా వాకర్ బ్లాంకో ఈ బ్రేకప్ వార్తలపై ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ వ్యవహారంపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. కాగా, 2024 మధ్యలో జరిగిన అనంత్ అంబానీ-రాధికా మర్చంట్ వివాహ వేడుకల సందర్భంగా అనన్య పాండే, వాకర్ బ్లాంకో మధ్య పరిచయం ఏర్పడినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ పరిచయం క్రమంగా స్నేహంగా, ఆ తర్వాత ప్రేమగా మారిందని బీ-టౌన్ వర్గాల్లో ప్రచారం జరిగింది.వీరిద్దరూ కలిసి పలు ప్రైవేట్ కార్యక్రమాల్లో కనిపించడం, సోషల్ మీడియాలో ఒకరికొకరు ప్రత్యేకంగా స్పందించడం వంటి అంశాలు వారి రిలేషన్‌షిప్‌పై మరింత చర్చకు దారితీశాయి. ముఖ్యంగా వాకర్ పేరుకు సంబంధించిన లాకెట్‌ను అనన్య ధరించినట్లు వచ్చిన వార్తలు కూడా అప్పట్లో వైరల్ అయ్యాయి.అయితే తమ ప్రేమ గురించి అనన్య, వాకర్ ఇద్దరూ ఎప్పుడూ బహిరంగంగా అధికారిక ప్రకటన చేయలేదు. ఇప్పుడు విడిపోయారనే వార్తలు రావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం ఇద్దరి మధ్య వచ్చిన కొన్ని విభేదాల కారణంగా ఈ బంధానికి ముగింపు పలికారనే ప్రచారం సాగుతోంది. అయితే ఎలాంటి పెద్ద గొడవలు లేకుండా, పరస్పర అంగీకారంతోనే స్నేహపూర్వకంగా వేర్వేరు మార్గాలను ఎంచుకున్నట్లు కూడా సినీ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఈ వార్తలపై అధికారిక ధృవీకరణ లేనందున, ప్రస్తుతం ఇవన్నీ మీడియా వర్గాల్లో జరుగుతున్న ప్రచారంగానే పరిగణించాల్సి ఉంటుంది. వాకర్ బ్లాంకోకు ముందు అనన్య పాండే పేరు బాలీవుడ్ నటుడు ఆదిత్య రాయ్ కపూర్‌తోను బలంగా వినిపించిన సంగతి తెలిసిందే. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు చాలాకాలం బాలీవుడ్ మీడియాలో హల్‌చల్ చేశాయి. అనంతరం ఆ బంధానికి కూడా ముగింపు పలికారనే ప్రచారం జరిగింది. ఇప్పుడు వాకర్ బ్లాంకోతోనూ బ్రేకప్ వార్తలు రావడంతో అనన్య వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలిచింది. రు.

# 18న వస్తోన్న అనుమాన పక్షి




డిజె టిల్లు'తో సెన్సేషనల్ డెబ్యూను అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ రెండో సినిమా 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా ఈ సినిమాను రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మించారు. తొలి చిత్రం తరహాలోనే ఈ సినిమానూ యునిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా విమల్ కృష్ణ తెరకెక్కించారు. తమ 'అనుమాన పక్షి' చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల తేదీని తెలియజేస్తూ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా విభిన్నమైన టోన్‌తో పాటు హీరో విచిత్రమైన ఆలోచనా విధానాన్ని ఈ పోస్టర్ ప్రజెంట్ చేస్తోంది. రాగ్ మయూర్ సంప్రదాయ దుస్తుల్లో చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఆయన పక్కనే ఉన్న బ్లాక్‌బోర్డుపై 'డౌట్స్ అండర్ ఇన్వెస్టిగేషన్' అనే టైటిల్‌తో జీవితం, విధి, కర్మ, దేవుడి ఎ÷-లానింగ్స్ కు సంబంధించిన ఆసక్తికరమైన ప్రశ్నలను పొందుపరిచారు. 'ఒన్ బోయ్. బిలియన్ థాట్స్, జీరో చిల్' అనే ట్యాగ్‌లైన్ ఆయన పాత్రలోని ఆలోచనా విధానాన్ని మరింత ఆసక్తికరంగా తెలియజేస్తోంది.

# గొప్పవాళ్లంతా సింగిల్సే..

## -ప్రతి సక్సెస్‌ఫుల్ వ్యక్తి వెనుక మహిళ ఉండదు: ఆర్జీవీ సంచలన పోస్ట్



టాలీవుడ్‌లో కాంట్రవర్సీలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే దర్శకుడు రాంగోపాల్ వర్మ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. నిత్యం ఏదో ఒక అంశంపై తనదైన శైలిలో స్పందించే ఆర్జీవీ.. తాజాగా సింగిల్స్ గురించి చేసిన వ్యాఖ్యలు నెటిజన్ల మధ్య ఆసక్తికర చర్చకు దారితీశాయి. సాధారణంగా ప్రతి విజయవంతమైన పురుషుడి వెనుక ఒక మహిళ ఉంటుంది అనే మాటను తరచూ వింటుంటాం. అయితే ఈ మాటతో తాను ఏకీభవించనన్నట్లుగా ఆర్జీవీ తన ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. దేశంలో, ప్రపంచంలో గొప్ప విజయాలు సాధించిన అనేక మంది ప్రముఖులు సింగిల్స్‌గా ఉన్నారంటూ ఆసక్తికరమైన పేర్లను ప్రస్తావించారు.ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, టాటా, బాటా, ఏపీజే అబ్దుల్ కలాం, సల్మాన్ ఖాన్, రాహుల్, యోగి, బాబా రాందేవ్ వంటి ప్రముఖులను ఉదాహరణగా చెబుతూ.. ప్రతి సక్సెస్‌ఫుల్ పురుషుడి వెనుక మహిళ ఉండాల్సిన అవసరం లేదు. గొప్పవాళ్లు సింగిల్స్‌గా కూడా గొప్ప విజయాలు సాధించగలరు అనే అర్థంలో ఆర్జీవీ వ్యాఖ్యానించారు. ఆయన చేసిన ఈ పోస్ట్ క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కొందరు ఆర్జీవీ అభిప్రాయంతో ఏకీభవిస్తుండగా, మరికొందరు మాత్రం ఆయన వ్యాఖ్యలను సరదాగా తీసుకుంటూ సెటైర్లు వేస్తున్నారు. "ఈ గొప్పవాళ్ల జాబితాలో మీరు ఎక్కడ ఉన్నారు?" అంటూ కొందరు నెటిజన్లు ఆర్జీవీని ఫన్నీగా ప్రశ్నిస్తున్నారు. ఇంకొందరు ఆయనపై తమదైన శైలిలో కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా.. ఎప్పటిలాగే ఆర్జీవీ చేసిన ఒక్క పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకే కారణమైంది. సింగిల్‌గా ఉండటం, వివాహం చేసుకోవడం వ్యక్తిగత ఎంపిక అని.. విజయానికి వాటితో సంబంధం లేదని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతుండగా, మరికొందరు మాత్రం "ప్రతి విజయానికి వెనుక కుటుంబం, స్నేహితులు, సహచరుల మద్దతు కూడా కీలకమే" అంటూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి తన వివాదాస్పద, విభిన్న ఆలోచనలతో మరోసారి నెటిజన్లను చర్చకు లాగిన రాంగోపాల్ వర్మ.. ఈసారి "సింగిల్సే గ్రేట్" అంటూ చేసిన కామెంట్లతో వార్తల్లో నిలిచారు.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450